క్లుప్తంగా

కౌంటింగ్ రోజు ప్రశాంతంగా ఉండండి

• ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి

కావలి: ఓట్ల లెక్కింపు సమయంలో, ఫలితాలు ప్రకటించిన తరువాత ప్రతిఒక్కరూ ప్రశాంతంగా ఉండాలని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేశారన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అధికార యంత్రాంగంతో పాటు ప్రజలు, నాయకులు, కార్యకర్తలు సహకరించారన్నారు. అదే విధంగా కౌంటింగ్ రోజున ప్రతిఒక్కరూ సంయమనం పాటించాలన్నారు. అధికారులు నిష్పక్షపాతంగా కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలన్నారు. ఫలితాల ప్రకటన తరువాత పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడా ఘర్షణలకు పోకుండా పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రశాంతంగా ఉండాలని సూచించారు. అధికారులు కూడా సహకరించి ఎటువంటి అల్లర్లు జరగకుండా చూడాలని కోరారు.

నగదు ప్రోత్సాహకాల అందజేత



నెల్లూరు(వేదాయపాళెం): మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూళ్లలో చదువుతూ పదో తరగతిలో 550కుపైగా మార్కులు సాధించిన విద్యార్థులకు కటారి తిరుపాల్ స్మారక అవార్డులను ఆదివారం ప్రదానం చేశారు. నగరంలోని ఐఎంఏ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో సుజాతమ్మ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు, డాక్టర్ మాదాల వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఈ ఏడాది 96 మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేశామని చెప్పారు. జెట్టి శేషారెడ్డి ట్రస్ట్ చైర్మన్ చంద్ర రాజగోపాల్, రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల సూపరింటెండెంట్ రాజేశ్వరరావు, మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, ఐఎంఏ మాజీ అధ్యక్షుడు డాక్టర్ అశోక్, డాక్టర్ సుజాతమ్మ, మాదాల వెంకటకృష్ణ, డాక్టర్ వెంకటరాజేష్, రూపేష్, మేఘన, కేఎన్నార్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు విజయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



నెల్లూరు(వేదాయపాళెం): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని దేవాంగ సంక్షేమ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుత్సల రామకృష్ణ పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ మార్కులను సాధించిన దేవాంగ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను పొదలకూరు రోడ్డులోని హెచ్‌ఆర్ కల్యాణ మండపంలో నెల్లూరు జిల్లా దేవాంగ సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. సంక్షేమ సంఘ ఉపాధ్యక్షుడు డాక్టర్ సతీష్‌కుమార్, రాఘవ పౌల్ట్రీ ఫారమ్స్ అధినేత కర్ణ రాఘవరావు, పంచాయతీరాజ్ విశ్రాంత ఎస్‌ఈ పముజుల నాగేశ్వరరావు, ఆక్వా ఫారమ్స్ అధినేత పముజుల రవి, దేవాంగ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు మన్నెం సతీష్, ప్రధాన కార్యదర్శి పముజుల శంకరయ్య, కోశాధికారి కొండా మాధవయ్య, జక్కల సురేష్, సజ్జా నవోదయ, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన నిమ్మ ధరలు

• బస్తా కాయలు రూ.ఆరు వేలు



పొదలకూరు: సాధారణంగా జూన్‌లో నిమ్మ ధరలు తగ్గుముఖం పడుతుంటాయి. అయితే ఈ ఏడాది మాత్రం రెండు రోజులుగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో కిలో నిమ్మ ధరలు రూ.35 నుంచి రూ.75 వరకు పలుకుతున్నాయి. బస్తా (లూజు) టాప్ ధర రూ.ఆరు వేల వరకు పలుకుతోందని వ్యాపారులు తెలిపారు. మార్కెట్‌కు ప్రస్తుతం కాయలు తక్కువగా వస్తుండటంతో ధరలు పెరుగుతున్నాయని తెలుస్తోంది. మరోవైపు ఏలూరు, తెనాలి, గూడూరు తదితర మార్కెట్ల నుంచి కాయల ఎగుమతి తగ్గింది. తోటల నుంచి కాయలు ఆశించిన స్థాయిలో రాకపోవడంతో డిమాండ్ కొంత మేర పెరిగి జూన్‌లో ధరలు పలుకుతున్నాయి.

గెలిచేదెవరో.. ఓడేదెవరో..

- రేపే ఎన్నికల కౌంటింగ్
- ఉదయగిరి ఫలితంపై సర్వత్రా ఉత్కంఠ
- 24 రౌండ్లలో తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- వైఎస్సార్‌సీపీలో విజయంపై ధీమా



ఉదయగిరిలో ఓట్ల లెక్కింపుపై ఏజెంట్లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఉదయగిరి అసెంబ్లీ ఎన్నికల ఫలితంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. సార్వత్రిక ఎన్నికలు మే 13న ముగిశాయి. కౌంటింగ్‌కు మరో 24 గంటల సమయం మాత్రమే మిగిలి ఉంది. ఈ దఫా ఉదయగిరి స్థానం నుంచి ప్రధాన రాజకీయ పార్టీలైన వైఎస్సార్‌సీపీ నుంచి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, టీడీపీ నుంచి కాకర్ల సురేష్ బరిలో నిలిచారు. ఇరువురు అభ్యర్థులు రాజకీయాలకు కొత్త కావడం..తొలిసారిగా ఎన్నికల బరిలో నిలవడంతో ఉదయగిరి ఫలితంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. కౌంటింగ్ సమయం దగ్గర పడుతున్న కొద్దీ గెలిచేదెవరో..ఓడేదెవరో అంటూ సర్వత్రా చర్చలు నడుస్తున్నాయి. ఈ దఫా ఎన్నికల్లో ఉదయగిరి నియోజకవర్గంలో మొత్తం 2,41,861 ఓట్లు ఉండగా , 1,97,970 మంది ఓటును వినియోగించుకున్నారు. 83.64శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ పూర్తయినప్పటి నుంచి కౌంటింగ్ కోసం ప్రజలు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఉదయగిరి నియోజకవర్గ రాజకీయ ముఖచిత్రాన్ని పరిశీలిస్తే.. టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీకి ఉదయగిరి నియోజకవర్గంలో పెద్దగా బలం లేదని స్పష్టంగా తెలుస్తోంది. కాంగ్రెస్, వైఎస్సార్‌సీపీనే ప్రజలు ఆదరించినట్లుగా గణాంకాలు చెబుతున్నాయి. 1952లో ఉదయగిరి నియోజకవర్గం ఆవిర్భావం నుంచి నేటి వరకు 16 సార్లు సార్వత్రిక ఎన్నికలు జరుగగా, ఒక్కసారి ఉపఎన్నిక జరిగింది. 1982లో టీడీపీ స్థాపన తర్వాత నేటి వరకు పదకొండుసార్లు ఎన్నికలు జరుగగా, ఒక్కసారి బీజేపీ, రెండు సార్లు టీడీపీ, ఒక్కసారి స్వతంత్ర అభ్యర్థులు గెలిచారు. మిగిలిన ఆరుసార్లలో మూడు సార్లు కాంగ్రెస్, మరో మూడుసార్లు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయం సాధించారు. 2024 సార్వత్రిక ఎన్నికల ఫలితం మంగళవారం తేలనుంది. 2019 ఎన్నికల్లో ఉదయగిరి స్థానం నుంచి వైఎస్సార్‌సీపీకి తరఫున బరిలో నిలిచిన మేకపాటి చంద్రశేఖర రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించారు. గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు గడపగడపకు చేరాయి. సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన పేద, మధ్యతరగతి ప్రజలు తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే రావాలని కాంక్షిస్తూ ఈ దఫా ఎన్నికల్లో ఆ పార్టీకే ఓటేసినట్లు సమాచారం. ముఖ్యంగా మహిళలు ఫ్యాన్ గుర్తుకే ఓటేసి తమ కృతజ్ఞత చాటుకున్నట్లు పోలింగ్ సరళిని బట్టి తెలుస్తోంది. ప్రజల ఆశల మేరకు ఉదయగిరి అసెంబ్లీ స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి విజయం సాధించే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

ఓట్ల లెక్కింపు ఇలా..

ఉదయగిరి నియోజకవర్గ పరిధిలో సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు, వింజమూరు, కలిగిరి, కొండాపురం, జలదంకి మండలాలు ఉన్నాయి. వాటి పరిధిలో 324 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఈ దఫా ఎన్నికల్లో 1,97,970 మంది ఓటు వినియోగించుకున్నారు. ఉదయగిరికి సంబంధించిన ఓట్ల లెక్కింపు ప్రక్రియ నెల్లూరురూరల్ పరిధిలోని పియదర్శిని కళాశాలలో మంగళవారం జరగనుంది. కౌంటింగ్‌కు సంబంధించి 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. మొత్తం 24 రౌండ్లలో ఓట్లను లెక్కించనున్నారు. తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించనున్నారు. ఆ తరువాత ఈవీఎంలను లెక్కించనున్నారు. తొలుత సీతారామపురం మండలం నుంచి ఓట్ల లెక్కింపును ప్రారంభించి రెండు రౌండ్లలో పూర్తి చేయనున్నారు. ఆ తరువాత 3,4,5 రౌండ్లలో ఉదయగిరి, 6,7 రౌండ్లలో వరికుంటపాడు, 8,9,10 రౌండ్లలో దుత్తలూరు, 11,12,13 రౌండ్లలో వింజమూరు, 14,15,16 రౌండ్లలో కొండాపురం, 17,18,19 రౌండ్లలో కలిగిరి, 20, 21, 22, 23,24 రౌండ్లలో జలదంకి మండలాలకు సంబంధించిన ఓట్లను లెక్కించనున్నారు. చివరగా 24వ రౌండ్‌లో చామదల హరిజనవాడలోని 323వ పోలింగ్ కేంద్రంలోని 624 ఓట్లను లెక్కించి ఉదయగిరి తుది ఫలితాన్ని వెల్లడించనున్నారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మకు పల్లకిసేవ



అల్లూరు: వైఎస్సార్‌సీపీ విజయాన్ని కాంక్షిస్తూ అల్లూరు బీసీకాలనీలోని పోలేరమ్మ చెట్టు వద్ద ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి సీఎం కావాలని, నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డి, కావలి ఎమ్మెల్యేగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మూడోసారి గెలుపొందాలని స్థానిక నాయకుడు సామంతుల సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలేరమ్మకు పల్లకిసేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



సీతారామపురంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై అనూష



చేజర్ల మండలం ఆదూరుపల్లిలో...

సీతారామపురం: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా, ఫలితాల ప్రకటన అనంతరం ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై పీ అనూష హెచ్చరించారు. మండలంలోని సీతారామపురం,బసినేనిపల్లి, సింగారెడ్డిపల్లి, సంజీవరెడ్డినగర్ గ్రామాల్లో ఆదివారం ఆమె పర్యటించారు. ప్రజలకు శాంతిభద్రతలపై అవగాహన కలిగించారు. ఎన్నికల ఫలితాలు ప్రకటించిన సందర్భంలో సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు, బాణసంచా పేల్చడం వంటి వాటికి అనుమతి లేదన్నారు. ఎవరైనా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సహకరించాలని కోరారు. సోషల్ మీడియా అడ్మిన్లు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా, అవమానకరంగా, నేరప్రేరేపిత విధంగా అసత్య సమాచారాలు పంపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసుల నియమ నిబంధనలను ప్రతిఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

చేజర్ల: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా మండలంలో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై ప్రభాకర్ హెచ్చరించారు. మండలంలోని వివాదాస్పద ప్రాంతాలైన చేజర్ల, ఆదూరుపల్లి, నాగులవెలటూరులో ఆదివారం పోలీస్ బందోబస్తు ఏర్పాటును చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా మండలంలోని అన్ని ప్రాంతాలపై ప్రత్యే నిఘా ఉంచామన్నారు. పోలీసు యాక్ట్ 30 అమల్లో ఉన్నందున ర్యాలీలు, ధర్నాలు, బాణసంచా కాల్చడం వంటి కార్యక్రమాలు చేయరాదన్నారు. శాంతిభద్రతలకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత తుంగా మృతి



ఇందూదర్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

సంగం: మండలంలోని తరుణవాయికి చెందిన వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు తుంగా దయాకర్‌రెడ్డి ఆదివారం మృతి చెందారు. ఆయన మృతి విషయం ఆలస్యంగా తెలుసుకున్న ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సాయంత్రం దయాకర్‌రెడ్డి తనయుడు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు తుంగా ఇందూదర్‌రెడ్డి కుటుంబాన్ని నెల్లూరులోని వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట పాపకన్ను మధుసూదన్‌రెడ్డి, కూనం సుధాకర్‌రెడి, వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్ కంటాబత్తిన రఘునాథరెడ్డి, తరుణవాయి సర్పంచ్ శోభాబాలనాయుడు, రావుల ప్రసాద్‌గౌడ్, మోహన్‌రెడ్డి, కరిముల్లా, కోటారెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రజారోగ్యమే జేవీవీ లక్ష్యం



వివరాలు నమోదు చేసుకుంటున్న రోగులు

ఆత్మకూరు: ప్రజారోగ్యమే లక్ష్యంగా జనవిజ్ఞాన వేదిక జిల్లాలోని పలు ప్రాంతాల్లో రెండు నెలలకోసారి వైద్యశిబిరాలు నిర్వహిస్తోందని జేవీవీ నాయకులు తెలిపారు. పట్టణంలోని షిర్డీ సాయిరాం కళాశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. నెల్లూరు ప్రజావైద్యశాల వైద్యులు రోగులకు షుగర్, బీపీ, తదితర పరీక్షలు నిర్వహించి తక్కువ ధరకు రెండు నెలలకు సరిపడా మందులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవల్లిక మాట్లాడుతూ డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం సహకారంతో ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, హెల్త్‌సూపర్‌వైజర్ టీ వరప్రసాద్, జేవీవీ నాయకులు హరిప్రసాద్, మురళీకృష్ణ, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ షేక్ సందానీ, ఎల్ కృష్ణప్రసాద్, సాధిక్‌హుస్సేన్, గంగాధర్, ఎల్‌ఐసీ కృష్ణారెడ్డి, కే పెంచలయ్య, గీత, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మకు పొంగళ్లు



కలిగిరి: కృష్ణారెడ్డిపాళెంలో గ్రామదేవత పోలేరమ్మ పొంగళ్ల కార్యక్రమాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం మహిళలు సామూహికంగా ఆలయం వద్దకు వెళ్లి సద్దిని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. పెద్దతల్లి వేపచెట్టుకు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం మహిళలు సామూహికంగా డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా పోలేరమ్మ ఆలయం వద్దకు చేరుకుని పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఏడాది సంమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలతో గ్రామం సుభిక్షంగా ఉండేలా చూడాలని వేడుకున్నారు.

అక్రమంగా నిర్మించిన ప్రహరీ తొలగింపు



సీతారామపురం: మండలంలోని సంజీవరెడ్డినగర్‌లో అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లే దారిని ఆక్రమించి నిర్మించిన ప్రహరీని తహసీల్దార్ కృష్ణారెడ్డి, ఎస్సై అనూష ఆదివారం తొలగించారు. ఇటీవల గ్రామానికి చెందిన ఓ మహిళ అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లే దారిని ఆక్రమించి దౌర్జన్యంగా ప్రహరీ నిర్మించింది. ఈ విషయమై ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది మండలాధికారులను పలుమార్లు కలిసి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు స్పందించిన అధికారులు ప్రహరీని పరిశీలించి తొలగించారు.

ఉత్తర కాలువ అభివృద్ధితో పుష్కలంగా సాగునీరు



రామస్వామిపల్లి వరకు చేపట్టిన విస్తరణ పనులు

ఆత్మకూరురూరల్: సోమశిల ఉత్తర కాలువ అభివృద్ధి పనులు రైతాంగానికి వరంలా మారాయి. ఆత్మకూరు నియోజకవర్గంలోని రైతాంగానికి జీవజలాలు అందిస్తున్న ఉత్తరకాలువ అభివృద్ధిపై 2019లో జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరువాత ప్రత్యేక దృష్టి సారించారు. 2020 డిసెంబరు 2న ఉత్తర కాలువ అభివృద్ధి పనులకు రూ.632 కోట్ల వ్యయ అంచనాతో పరిపాలనాపరమైన అనుమతులు మంజూరు చేసింది.రివర్స్ టెండరింగ్ విధానంలో 0.43 శాతం లెస్‌తో రూ.522.17 కోట్ల అంచనాలతో పనులు చేపట్టేందుకు వీపీఆర్, జీడీఆర్, ఎంఆర్‌జీఆర్ ఏజెన్సీలు ముందుకొచ్చాయి. సోమశిల జలాశయం 0 కిలో మీటర్ నుంచి 99.720 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాళ్లపాడు రిజర్వాయర్ వరకు కాలువకు ఇరువైపులా కాంక్రీటు గోడలతో లైనింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. అయితే గతేడాది 50 కిలోమీటర్లకుపైగా పనులను కాంట్రాక్టర్లు పూర్తి చేయగలిగారు. భారీ వర్షాలు, ప్రకృతి విపత్తులు, తదితర కారణాలతో మిగిలిన పనుల్లో జాప్యం జరిగింది. అయినప్పటికీ సోమశిల జలాశయం నుంచి నెల రోజుల్లో 1.5 టీఎంసీల సాగు జలాలను రాళ్లపాడు రిజర్వాయర్‌కు తరలిస్తున్నారు. దీంతో పాటు అనంతసాగరం మండలంలోని బొమ్మవరం, ఆత్మకూరు మండలంలోని వెన్నవాడ, ఆరవేడు, కొండాపురం మండలంలోని దూబగుంట గ్రామాల రైతులకు ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందించగలుగుతున్నారు. కాగా ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఉత్తరకాలువ జలాలను ఎత్తిపోతల పథకాల ద్వారా నియోజకవర్గంలోని పలు గ్రామాల చెరువులకు అందించేలా ప్రణాళికలు రూపొందించారు. దీంతో వచ్చే వ్యవసాయ సీజన్‌లో తమ సాగునీటి సమస్యలు తీరుతాయని అన్నదాతలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

యోగా గురువుకు సన్మానం

కొడవలూరు: మండలంలోని గండవరం ఆయుర్వేద వైద్యశాల యోగా శిక్షకుడు జ్యోతి రాజేంద్రకుమార్‌ను కోవూరులోని జనచైతన్య యోగా కేంద్ర ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా రాజేంద్రకుమార్ మాట్లాడా రు. యోగా సాధన ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను దూరం చేసుకోవచ్చని వివరించారు.

నేత్రపర్వంగా అభయాంజనేయస్వామి కల్యాణం



అనుమసముద్రంపేట: హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా రాజవోలులోని అభయాంజనేయసామి దేవస్థానంలో అభయాంజనేయ స్వామి, సువర్చలాదేవి కల్యాణ మహోత్సవాన్ని శనివారం రాత్రి నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులు విశేషంగా హాజరై కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉభయదాతల ఆధ్వర్యంలో గాలిబోయిన రమణయ్య, మంతు ప్రభాకర్‌రెడ్డి అన్నప్రసాద వితరణ చేశారు.గ్రామానికి చెందిన మంతు రామకృష్ణారెడ్డి, గొల్లప్రోలు రవి, మంతు ప్రేమ్‌నాథ్‌రెడ్డి దంపతులు, ముంగుమూరు వెంకటరెడ్డి, సూరం ప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ నరసయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి గ్రామోత్సవం



దుత్తలూరు: ఆంజనేయస్వామి గ్రామోత్సవం

దుత్తలూరు: మండలంలోని వెంకటంపేటలో నిర్వహిస్తున్న హనుమజ్జయంతి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరిరోజు ఆంజేయస్వామి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం సహస్రనామార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం ఆంజనేయస్వామి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల నడుమ గ్రామోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. వెంకటంపేటకు చెందిన ఐ.వెంకటేశ్వరరెడ్డి దంపతులు 14 కేజీల లడ్డూ ప్రసాదాన్ని బహుకరించి మొక్కు తీర్చుకున్నారు.

దుత్తలూరులో భారీ వర్షం



సోమలరేగడలో విరిగిపడిన విద్యుత్ స్తంభం

దుత్తలూరు: మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. వేకువజామున అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులు, గాలులతో వర్షం పడడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. పిడుగులతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సోమలరేగడలో వేర్వేరుచోట్ల రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో గ్రామస్తులు తాగునీటికి ఇబ్బందులు పడ్డారు. ఆదివారం ఎండ తీవ్రత పెద్దగా లేనప్పటికి ఉక్కపోతతో ప్రజలు అల్లాడారు.

కొండాపురం: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం వేకువన ఓ మోస్తరు వర్షం కురిసింది. వారంతో రోజులుగా ఎండతీవ్రత, ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఈ తరుణంలో వర్షం కురవడంతో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. ఎండ తీవ్రత తగ్గడంతో ప్రజలు కాస్త ఉపశమనం పొందారు.

వరికుంటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. అర్ధరాత్రి 2 గంటల నుంచి వేకువజామున 4 గంటల వరకు వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకల్లోకి నీరు చేరింది. పొలాలు దున్నుకునేందుకు వర్షం దోహద పడిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా వర్షంతో వాతావరణం చల్లబడడంతో ఎండ తీవ్రత, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు ఉపశమనం పొందారు.

మానవతా విలువలకు ప్రతీక 'అశ్వతి'



కథల సంపుటిని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ రవికుమార్

మర్రిపాడు: పొంగూరుకు చెందిన చార్టెడ్ అకౌంటెంట్, రచయిత సడ్డా సుబ్బారెడ్డి రచించిన అశ్వతి కథల సంపుటి మానవతా విలువలు, గురుశిష్యుల అనుబంధాన్ని ప్రతిబింబించేలా ఉందని బిట్స్ పిలాని ప్రొఫెసర్ డాక్టర్ యడవల్లి రవికుమార్ పేర్కొన్నారు. మండలంలోని పొంగూరులో అశ్వతి కథల సంపుటిని ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి రవికుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అశ్వతి కథల సంపుటిలోని ప్రతి కథ మానవతా విలువలను పెంపొందించేలా ఉందన్నారు. అంతేకాకుండా సమాజంలో గురువు ప్రాధాన్యాన్ని, శిష్యుల అభ్యున్నతికి వీరాంజనేయులు మాష్టర్ పడే తపనను సుబ్బారెడ్డి చాలా చక్కగా వివరించారన్నారు. రచయిత సుబ్బారెడ్డి మాట్లాడుతూ యండమూరి వీరేంద్రనాథ్ రచనలను స్ఫూర్తిగా తీసుకుని తాను కథలను రచించినట్లు తెలిపారు. చిన్నారుల భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ఉపాధ్యాయులు కృష్ణమోహన్, మురళి, నాగేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.